క్లుప్తంగా

అంబులెన్స్ లేక అవస్థలు

నర్మెట: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో 108 అంబులెన్స్ లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గతంలో ఉన్న అంబులెన్స్ కరెంట్ షాట్‌సర్క్యూట్‌తో కాలిపోవడం జరిగింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు అంబులెన్స్ సేవలు అందడం లేదు. ఇటీవల మండలానికి చెందిన గొట్టి వెంకటయ్యకు గుండెపోటు రాగా అంబులెన్స్ అందుబాటులో లేక మృతి చెందాడు. రోడ్డు ప్రమాదాలు జరిగిన వారు కూడా సమయానికి ఆస్పత్రికి వెళ్లలేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

దేవరుప్పుల: ఎమ్మెల్యే యశస్విని‌రెడ్డి సహకారంతో మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను అప్పిరెడ్డిపల్లిలో లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకుడు రామచంద్రునాయక్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇంటింటా ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, అన్నదాతలకు పంట రుణమాఫీ వంటివి అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పరిపాలన దక్షతకు నిదర్శనమన్నారు. మల్లయ్య, బాగాల మాలతి, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన సేవలు

బచ్చన్నపేట: రైతులకు నాణ్యమైన విద్యుత్ సేవలను అందిస్తున్నామని మన్‌సాన్‌పల్లి ట్రాన్స్‌కో లైన్‌మన్ రడమల్ల కర్ణాకర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో రైతులకు అందుబాటులో ఉంటూ శాఖా పరమైన అన్ని సేవలను అందిస్తున్నామని తెలిపారు. గ్రామానికి చెందిన రైతు రెడ్డబోయిన సత్యనారాయణ తనకు చెప్పకుండానే ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫ్యూజ్ వైరు వేయడానికి వెళ్లగా విద్యుదాఘాతానికి గురయ్యాడని, ఎల్‌సీ తీసుకుని వైరును మళ్లీ సరిచేయడంతో బోరు మోర్లు నడుస్తున్నాయని తెలిపారు. రైతుల వ్యవసాయ బావులకు నాణ్యమైన కరెంట్‌ను అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. తనపై చేసిన ఆరోపణలు సరికాదన్నారు. రైతులు ఉన్నారు.

అన్నదానం

జఫర్‌గఢ్: సమాజంలో అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని రూరల్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బల్దె సతీష్ అన్నారు. మండల కేంద్రంలోని వేల్పుగొండ లక్ష్మీనర్సింహస్వామి దర్శనానికి వచ్చి భక్తులకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కృష్ణమూర్తి, పాలకుర్తి రాజయ్య, బోనగిరి శ్రవణ్‌కుమార్, సీతారాములు అంచూరి యుగేందర్, నాగరాజు, హరిశంకర్ పాల్గొన్నారు.

పరామర్శ

పాలకుర్తి టౌన్: మండలంలోని ఈరవెన్ను మాజీ సర్పంచ్ కొమ్మురోజు సోమన్న భార్య కనకలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందింది. కాగా, శనివారం తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, పాలకుర్తి నియోజకవర్గ నాయకుడు హనుమండ్ల తిరుపతిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రఘునాథపల్లిలో..

జఫర్‌గఢ్: మండలంలోని రఘునాథపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దండు చంద్రయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా, విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య శనివారం గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

సన్మానం

రఘునాథపల్లి: మండలంలోని మాదారం పంచాయతీ కార్యదర్శి ఎ.నర్మద బదిలీ అయిన సందర్భంగా శనివారం జీపీ వద్ద మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాలు, పంచాయతీ సిబ్బంది శాలువాలతో ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ గుడి రాంరెడ్డి మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శిగా అంకితభావంతో గ్రామస్తులకు నర్మద అందజేసిన సేవలు ఆదర్శనీయమన్నారు. మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు మహేష్, కార్యదర్శులు మాజీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నేడు కంటి వైద్యశిబిరం

బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామంలో నేడు (ఆదివారం) ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ సర్పంచ్ వేముల వెంకటగౌడ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ త్రినేత్రి కంటి దవాఖాన జనగామ వారు జీపీ వద్ద ఈ శిబిరాన్ని ఉదయం ఏర్పాటు చేస్తున్నారని, కంటి సమస్యలు ఉన్న వారు వినియోగించుకోవాలని కోరారు.

పార్టీ బలోపేతానికి కృషి

దేవరుప్పుల: పల్లెపల్లెనా బీజేపీ బలోపేతం కోసం సమన్వయంతో కృషి చేద్దామని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బ రాజశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు కాసాని సత్తయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లాలో కీలక పదవి వచ్చిన రాజశేఖర్‌ను సన్మానించారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా

- రాత్రింబవళ్లు తరలింపు
- పట్టించుకోని అధికారులు

తరిగొప్పుల: ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కుతూ కొందరు ఇసుకాసురులు యథేచ్ఛగా ప్రకృతి సంపదను కొల్లగొడుతూ జేబులు నింపుకుంటున్నారు. ప్రభుత్వం గ్రామాల్లో వాగులు, వంకల్లో లభించే ఇసుక ఆయా గ్రామాల్లో వాడుకోవచ్చనే నిబంధనలు సడలించడంతో కొందరు దళారులు ఇసుక అక్రమ రవాణాకు తెరలేపారు. అక్రమార్జనే ధ్యేయంగా అలవాటు పడి కొందరు రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ప్రతీ రోజు ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతున్నా అధికారులు సైతం అటువైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నారు. తరిగొప్పుల మండల పరిధిలో ఎలాంటి ఇసుక లభించే వనరులు లేనప్పటికీ పొరుగు మండలమైన చిల్పూర్‌లోని లింగంపల్లి గ్రామంలోని వాగులు, వంకల నుంచి ఇసుకను తోడేస్తూ అక్రమంగా రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పల్లెలోని వినియోగదారుల అవసరమే అవకాశంగా మార్చుకుని అక్రమార్కులు అందినకాడికి దండుకుంటున్నారు.



పట్టపగలే ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఇసుక

లోడుకు రూ.3 వేల పైనే..

ఒక్క ట్రాక్టర్ లోడుకు దొడ్డు ఇసుకకు దూరాన్ని బట్టి రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారు. రాత్రింబవళ్లు ఇసుక అక్రమ రవాణా అధికారులకు తెలియకుండానే జరుగుతుందా అనే అనుమాలు వ్యక్తం చేస్తున్నారు. అడ్డగోలుగా ఇసుక అక్రమ రవాణా వల్ల భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, సంబంధిత రెవెన్యూ, మైనింగ్ అధికారులు చొరవ తీసుకొని అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..



మండలకేంద్రంలో ఇసుక లభించే వనరులు లేవు. పక్క మండలాల నుంచి ఇసుక రవాణా చేస్తున్నారని సమాచారం ఉంది. ఇసుక లభించే ఆయా గ్రామాల్లోని ప్రజలు మాత్రమే ఇసుక వినియోగించుకునే వెసులుబాటు ఉంది. వేరే గ్రామాలకు ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– నాగేశ్వరాచారి, తహసీల్దార్

అటెన్షన్ ప్లీజ్



ప్రమాదకరంగా ఎండిన చెట్లు

లింగాలఘణపురం–నెల్లుట్ల రోడ్డులో లింగాలఘణపురం గ్రామ సమీపంలో రోడ్డుకు ఇరువైపుల ఉన్న భారీ చెట్లు ఎండిపోయి ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు కొమ్మలు విరుగుతాయో.. చెట్లు కూలీ మీద పడుతయో తెలియకుండా ఉన్నాయి. దీంతో నిత్యం మండల కేంద్రానికి వచ్చే ప్రయాణికులతో పాటు జీడికల్ మీదుగా మొత్కూరు వెళ్లే ఆటోలు, బస్సులు, ద్విచక్ర వాహనదారులు భయంభయంగా వెళ్తున్నారు. ఈదురు గాలులతో వర్షాలు కురిసే కాలం కావడంతో అధికారులు స్పందించి ఎండిపోయిన చెట్లను తొలగించి ప్రమాదాలు జరుగక ముందే చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– లింగాలఘణపురం

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
అశోక్, డీఈ, ఆర్ అండ్ బీ, జనగామ
ఫోన్‌నంబర్ : 7893028727

గీత కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న వెంకటమల్లయ్య

జఫర్‌గఢ్: కల్లుగీత కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటమల్లయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు గడ్డం రాజు అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరుల స్ఫూర్తితో హక్కుల సాధన కోసం పోరాడాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని ఇప్పటి వరకు అమలు చేయలేదని అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో గీతా కార్మికుల సంక్షేమానికి రూ.5 వేల కోట్లు కేటాయించాలన్నారు. వీటితో పాటు గీతా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కుర్ర ఉప్పలయ్య, నాయిని యాదగిరి, మేర్గు నర్సింగం, మూల యాకయ్య, వడ్లకొండ సుధాకర్, మల్లం రాజమౌళి, కొండల్‌గౌడ్, సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

జీపీ ఎదుట గ్రామస్తుల ఆందోళన

బచ్చన్నపేట: మండలంలోని మన్‌సాన్‌పల్లి గ్రామంలో నెలకొన్న సమస్యలను పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడం లేదని గ్రామస్తులు శనివారం జీపీ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కార్యదర్శి సకాలంలో ఇంటి, నల్లా పన్నులను వసూలు చేయడమే తప్ప గ్రామస్తులకు సౌకర్యాలు కల్పించడంలో విఫలమైనారని ఆరోపించారు. వీధి లైట్లు పని చేయడం లేదని, రాత్రి వేళ బయటకు రావాలంటే ఇబ్బంది పడుతున్నామని కార్యదర్శికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోయి, రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు మొలిచాయని తెలిపారు. గ్రామ అభివృద్ధి పట్టని పంచాయతీ కార్యదర్శిని సంబంధిత అధికారులు బదిలీ చేయాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో గీస సందీప్, సట్ట సుగుణ, వల్లెపు లక్ష్మి, గీస లక్ష్మి, బచ్చలి బాలవ్వ, పొన్నం సరిత, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

కాంప్లెక్స్ నిర్మాణానికి స్థల పరిశీలన

చిల్పూరు: ప్రభుత్వ కార్యాలయాల సమీకృత భవన నిర్మాణం కోసం శనివారం ఆర్డీఓ వెంకన్న స్థల పరిశీలన చేశారు. ఇటీవల ఎమ్మెల్యే కడియం శ్రీహరి మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోట ఉండేలా కాంప్లెక్స్ నిర్మాణం కోసం అనువైన స్థల పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆర్డీఓ వెంకన్న, తహసీల్దార్ సరస్వతి, ఆర్‌ఐ కల్వల శ్రీనివాస్, సర్వేయర్ నరేష్ నాయక్‌లు మండల కేంద్రంలోని 197, వెంకటాద్రిపేట గ్రామంలోని 182 సర్వేనంబర్‌లో స్థల పరిశీలన చేశారు. సోమవారం వరకు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామన్నారు.



చిల్పూరు: స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ వెంకన్న

ప్రభుత్వ స్థలానికి హద్దుల ఏర్పాటు

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని సైదవారి కుంట సమీపాన సర్వేనంబర్ 627లోని ప్రభుత్వ భూమికి రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో శనివారం హద్దులు ఏర్పాటు చేశారు. స్థానిక రైల్వే ఫ్లై ఓవర్ కింద సర్వే నంబర్ 627లోని ప్రభుత్వ భూమిని ఇటీవల ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరిశీలించిన నేపథ్యంలో ప్రభుత్వ స్థలం కబ్జాకు గురువుతుందని, ఇక్కడ రూ.5 కోట్లతో ఇంటిగ్రేటెడ్ కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేస్తామని, భూమిని సర్వే చేపట్టి సంబంధించిన హద్దులను ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో స్థానిక తహసీల్దార్ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ రాజు, మండల సర్వేయర్ నరేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ భూమిని సర్వే చేసి హద్దులను ఏర్పాటు చేశారు. ఎంఆర్‌ఐ రవీందర్, ఘన్‌పూర్ ఈఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

రఘునాథపల్లి: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రఘునాథపల్లి ఎస్సై దూదిమెట్ల నరేశ్ అన్నారు. శనివారం రాత్రి మండలంలోని వెల్ది గ్రామంలో వరంగల్ జాగృతి పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన పోలీస్ కళాజాతలో ఆయన మాట్లాడారు. సైబర్ నేరగాళ్లతో మోసపోతే వెంటనే సైబర్ టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. కళాజాతా బృందం చదువు, రోడ్డు ప్రమాదాలు, డయల్ 100, బాల్య వివాహాలు, బాల కార్మికులు, సీసీ కెమెరాలు, గుట్కా, డ్రగ్స్ తదతర వాటిపై వివరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్స్ యుగేందర్, వీరన్న, సురేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై నరేశ్

‘పారిశుద్ధ్య నిర్వహణపై పాలకవర్గ నిర్లక్ష్యం’



మాట్లాడుతున్న కనకారెడ్డి

జనగామ రూరల్: పట్టణంలో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యల పరిష్కారంలో పాలకవర్గం నిర్లక్ష్యం వహిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ కార్యదర్శి వర్గ సభ్యుడు బొట్ల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సైడ్ కాల్వల్లో మురుగు పేరుకపోయి దుర్గంధంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పట్టణంలో పారిశుద్ధ్య పనులు చేపట్టి, తక్షణమే కుక్కలు, కోతుల బెడదకు నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. జోగు ప్రకాష్, అజారుద్దీన్, లింగం, శ్రావణ్, బీరయ్య, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

జనగామ రూరల్: కోలకత్తాలో వైద్యురాలుపై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని శనివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ దిష్టి బొమ్మను దహనం చేశారు. నాయకులు కార్తీక్, నితీష్, వంశీ, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

వైద్యురాలు ఆత్మకు శాంతి కలగాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ చేపట్టి నివాళులర్పించారు. సీబీఐతో విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈకార్యక్రమంలో రాగళ్ల ఉపేందర్ , రాజశేఖర్, రవీందర్, అరుణ్ , రామ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి టౌన్: కోల్‌కత్తాలో వైద్యవిద్యార్థినిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో లయన్స్ క్లబ్ ఆఫ్ పాలకుర్తి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, మండల ఆర్‌ఎంపీల సంఘం, ప్రభుత్వ వైద్యులు, ప్రైవేట్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో శనివారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల బాధ్యులు మాట్లాడుతూ అత్యాచారం చేసి హత్య చేయడాన్ని వారు ఖండించారు. హత్యాచారానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అయా సంఘాల నాయకులు రాపాక విజయ్, మాచర్ల పుల్లయ్య, చిదురాల మహేందర్, బజ్జూరి వేణుగోపాల్, డాక్టర్ అపర్ణ, ఏఈ రణదీర్, పబ్బ సంతోష్, శీల చంద్రశేఖర్, దేవసాని కృపాకర్, సుదర్శన్, గుమ్మడిరాజుల సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



జనగామ రూరల్: కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న నాయకులు

కొనసాగిన వైద్యసేవలు..

నర్మెట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఓపీ వైద్య సేవలు కొనసాగాయి. వైద్యాధికారి డాక్టర్ రవళి స్టెల్లా జిల్లా కేంద్రంలో సమావేశానికి హాజరుకాగా ఆస్పత్రి సిబ్బంది రోగులకు ఓపీ సేవలు అందించారు.

నామమాత్రంగా..

దేవరుప్పుల: తెలంగాణ వ్యాప్తంగా కోల్‌కత్తాలో జూనియర్ వైద్యురాలి ఘటనకు నిరసనగా విధుల బహిష్కరణ పిలుపు నేపథ్యంలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నామమాత్రంగా వైద్య చికిత్సలు చేయగా పలు గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది వ్యాక్సినేషన్‌లో పాల్గొన్నారు. మండల వైద్యాధికారి పూజ కలెక్టరేట్ సమావేశానికి వెళ్లగా అక్కడ నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపగా మిగితా సిబ్బంది కోల్‌కత్తా ఘటనపై సత్వర చర్యలు తీసుకోకుంటే విధులు పూర్తిగా బహిష్కరిస్తామన్నారు.



వైద్యం కోసం నిరీక్షిస్తున్న రోగులు

పాఠశాలల్లో ముందస్తు రాఖీ వేడుకలు



తరిగొప్పుల: రాఖీలు కట్టుకుంటున్న విద్యార్థులు



దేవరుప్పుల: ప్రశాంతి విద్యానికేతన్‌లో..



లింగాలఘణపురం: పీవీఆర్ స్కూల్‌లో..

తరిగొప్పుల: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ముందస్తు రాఖీ వేడుకలు నిర్వహించారు. అన్నా చెల్లెలు, అక్కా తమ్ముళ్ల ప్రేమకి, గౌరవానికి ప్రతీకగా జరుపుకునే ఈ పండుగను పురస్కరించుకుని విద్యార్థులందరూ ఒకరికొకరు రాఖీలు కట్టుకున్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం బానోత్ రవీందర్ మాట్లాడుతూ అన్నాచెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు సూచికగా రాఖీ పండుగను జరుపుకుంటారన్నారు.

ఆత్మీయ అనురాగాలకు ప్రతీక రక్షాబంధన్

లింగాలఘణపురం: అన్నా చెల్లెల్లు, అక్కా తమ్ముల అనురాగాలకు ప్రతీకగా ఆత్మీయ బంధాలను గుర్తు చేసే పండుగ రక్షాబంధన్ అని వనపర్తి పీవీఆర్ పాఠశాల కరెస్పాండెంట్ వెంకట్‌రెడ్డి, చైర్‌పర్సన్ శ్రీలతారెడ్డి అన్నారు. మండలంలోని వనపర్తి పీవీఆర్ పాఠశాలలో శనివారం ముందస్తు రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఒకరినొకరు రక్షాబంధన్ ధరించారు. ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశాంతి విద్యానికేతన్‌లో..

దేవరుప్పుల: అన్నా చెల్లెల అనుబంధానికి ప్రతీకైన రక్షాబంధన్ పురస్కరించుకుని మండల కేంద్రంలోని శ్రీ సాయి ప్రశాంతి విద్యానికేతన్ హైస్కూల్‌లో ముందస్తు వేడుకలు జరుపుకున్నారు. పాఠశాలలో కరస్పాండెంట్ టి.పాండుకృష్ణ, ప్రిన్సిపాల్ స్వప్న ఆధ్వర్యంలో బాలికలు బాలురకు రాఖీలు కట్టి సోదరభావం విశిష్టతను చాటారు.

సభ్యులంతా ఓటింగ్‌లో పాల్గొనాలి

కొడకండ్ల: పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికలో సంఘ సభ్యత్వం కలిగిన ప్రతి సభ్యుడు ఓటింగ్‌లో పాల్గొని ఓటు వేయాలని పద్మశాలీ సంఘం రాష్ట్ర తాత్కాలిక అధ్యక్షుడు వేముల బాలరాజు కోరారు. శనివారం మండలకేంద్రంలోని పద్మశాలీ మార్కండేయ భవనంలో సంఘం మండల అధ్యక్షుడు పసునూరి మధుసూదన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ నెల 18వ తేది ఆదివారం అధికారికంగా ఓటింగ్ ద్వారా ఎన్నికలు ప్రభుత్వం నిర్వహిస్తుందని, కొడకండ్ల, పాలకుర్తి మండలాలకు చెందిన సభ్యులు పాలకుర్తిలోని సిద్ధార్థ పాఠశాలలో ఏర్పాటు చేసే పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఉపేందర్, వెంకటనారాయణ, నవీన్, ఉపేందర్, ఉప్పలయ్య, వెంకన్న, రవిందర్, మనోహర్, సత్యనారాయణ, ప్రభాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలరాజు

పేదలకు అండగా ప్రభుత్వం

జనగామ రూరల్: ప్రజా ఆరోగ్య విషయంలో పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం నిత్యం అందుబాటులో ఉంటుందని పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపూరి కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని గోపిరాజుపల్లెకు చెందిన సొడబోయిన రాజు కుమారుడు అజయ్‌కుమార్ ప్రమాదవశాత్తు కాలు పోవడంతో ఇంటి పట్టునే ఉంటున్నాడు. కృత్రిమ కాలు ఏర్పాటు కోసం కిరణ్‌కుమార్ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లగా రూ.1లక్ష 50వేల ఓల్‌ఓసీని మంజూరు చేశారు. కాగా, ఎల్‌ఓసీని శనివారం ఆయన బాధిత కుటుంబానికి అందజేశారు. మహేందర్‌రెడ్డి, కోమురయ్య, శ్రీదర్ రెడ్డి, వెంకటేష్, బాల్నె నరేష్ ,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

స్టేషన్‌ఘన్‌పూర్: హైదరాబాద్‌కు చెందిన హోప్ ఫర్ లైఫ్ సంస్థ ఫౌండర్ హిమజారెడ్డి సహకారంతో మండలంలోని శివునిపల్లి జెడ్పీఎస్ఎస్‌లో 8వ తరగతి చదివే విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఫౌండేషన్ సభ్యులు పల్లె రాజిరెడ్డి, సాంబరాజు చేతుల మీదుగా విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం కుసుమ రమేశ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందించే నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు సిద్ధమయ్యేందుకు అవసరమైన ఎన్ఎంఎంఎస్ పుస్తకాలను అందించడం సంతోషకరమన్నారు. ఈ మేరకు హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ వారిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అందించే అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన సూచించారు. ఉపాధ్యాయులు కె.ప్రవీణ్‌కుమార్, చంద్రమోహన్, జి.రవి, రాధాకృష్ణ, రమేష్, శర్మ, అరుణ, రజిని పాల్గొన్నారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

దేవరుప్పుల: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ఊర సృజన్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని దాసగాని కొండయ్య కుమారుడు రంజిత్(24) ప్రైవేట్ ఫైనాన్స్ తీసుకుని కారు నడుపుకుంటూ జీవనం కొనసాగించేవాడు. ఈ క్రమంలోనే మూడు నెలల కిందట రోడ్డు ప్రమాదంలో కారు ధ్వంసం కావడంతోపాటు అతని కాలు విరిగి అనారోగ్యానికి గురయ్యాడు. ఇటు కారు కిస్తీలు కట్టలేక ప్రత్యామ్నాయ ఆదాయం లేక కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లో కూలీనాలి చేసుకుంటున్న తరుణంలో చోటుచేసుకుంటున్న ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపానికి గురై శనివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయమై మృతుడి తండ్రి కొండయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.



రంజిత్ (ఫైల్)

సంక్షిప్త సమాచారం

పాఠశాలకు టీవీ బహూకరణ

దేవరుప్పుల: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు హైదరాబాద్‌కు చెందిన ఎన్ఆర్‌ఐ దంపతులు వైష్ణవి, తిరుమలేష్ టీవీతోపాటు విద్యార్థులకు టై, బెల్టులు బహూకరించారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఉమ, ఉపాధ్యాయురాలు స్వప్న, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేటి విద్యా సదస్సును జయప్రదం చేయండి

లింగాలఘణపురం: ఈ నెల 18(ఆదివారం)న జనగామలోని సేయింట్ మేరీస్ పాఠశాలలో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగే విద్యా సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వజ్రయ్య, ఉప్పల శ్రీహరి కోరారు. దీంతో పాటు ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులకు ఆత్మీయ అభినందన సభ కూడా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఖాళీ బిందెలతో గిరిజనుల నిరసన

చిల్పూరు: వారం రోజులుగా మిషన్ భగీరథ ద్వారా తాగు నీరు అందకపోవడంతో శనివారం మండలంలోని కొండాపూర్ పంచాయతీ పరిధిలోని యెర్రకుంటతండాలో గిరిజనులు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. మాజీ సర్పంచ్ రజిత రవీందర్, గాలి ప్రవీన్, నీలమ్మ పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్) లిబరేషన్‌ను బలోపేతం చేయాలి

పాలకుర్తి టౌన్: సీపీఐ(ఎంఎల్) లిబరేషన్‌ను బలోపేతం చేయాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, తెలంగాణ నిర్మాణ గైడ్, ఎస్.మూర్తి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో రమేష్‌రాజా, రజిత, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం

చిల్పూరు : మండలంలోని శ్రీపతిపల్లికి చెందిన వృద్ధురాలు కర్నకంటి రమణమ్మ తన కూతురు ఇంటికి వెళ్తూ కనిపించకుండా పోయింది. రమణమ్మకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఈనెల 13వ తేదీన కరీంనగర్‌లో ఉంటున్న కూతురు వద్దకు వస్తున్నట్లు సమాచారం ఇచ్చింది. గ్రామంలో బస్సు ఎక్కిన ఆమె మల్కాపూర్‌లో దిగింది. తల్లి ఇంటికి రాకపోవడంతో బంధువుల ఇళ్లలో వెతికినా ఫలితం లేకపోవడంతో శనివారం సాయంత్రం రమణమ్మ కుమారుడు మహేందర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపారు.

వర్షానికి కూలిన ఇల్లు

తరిగొప్పుల: మండల కేంద్రానికి చెందిన గందె సోమయ్య పెంకుటిల్లు శనివారం వర్షానికి కూలింది. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.



సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎన్. అనిల్ (S.R) : 9949363827 (పాలకుర్తి)
కె. రాజశేఖర్ (S.R) : 9640341435 (జనగామ)
జి. రవియాదవ్ (A.C.O) : 9032782191